రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్
వార్త

## కరాటేలో మేడ్చల్ విద్యార్థుల ప్రతిభ

**మేడ్చల్, డిసెంబర్ 17, (ప్రభాతవార్త) :** రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో మేడ్చల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి బంగారు పతకాలు సాధించారు. ఆదివారం నగరంలోని చింతల్‌లో జరిగిన ఈ పోటీల్లో మేడ్చల్ పట్టణానికి చెందిన యూనివర్సల్ 369 విద్యార్థులు పాల్గొన్నారు. అందులో అండర్ 12 విభాగంలో జ్యాపిక, రోజీ, కృష్ణప్రియలు బంగారు పతకాలు సాధించారు. అదే విధంగా సీనియర్ విభాగంలో నిత్యశ్రీ, వీరభద్ర, రిషి, చరణ్, తబరేజ్, మున్నా కుమార్‌లు బంగారు పతకాలు సాధించారు. పతకాలు సాధించిన విద్యార్థులను కుంపు గ్రాండ్ మాస్టర్ కన్నన్ గౌడ్, రవి, వినోద్‌లు అభినందించారు.

### వాహనాల పార్కింగ్, కొబ్బరికాయల విక్రయాలకు వేలం

ఘన్‌పూర్ గ్రామ శివారులోని శ్రీకేత్తగిరి జాతర సందర్భంగా వాహనాల పార్కింగ్, కొబ్బరికాయల విక్రయాల హక్కు కోసం నేడు ఆలయం వద్ద బహిరంగ వేలం పాట నిర్వహించనున్నట్లు దేవాదాయ శాఖ ఈఓ వెంకన్న పేర్కొన్నారు. జనవరి 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు నిర్వహించనున్న ఈ జాతరలో భక్తుల వాహనాల పార్కింగ్, కొబ్బరికాయలు అమ్ముకొనే హక్కు పొందడానికి నేడు మధ్యాహ్నం 12 గంటలకు దేవస్థానం వద్ద నిర్వహించే ఈ వేలం పాటలో ఆసక్తిగల వారు పాల్గొనాలి.

## ఐదో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం : ప్రిన్సిపాల్

**చేవెళ్ల, డిసెంబర్ 17 ప్రభాతవార్త :** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(కొడంగల్)లో 5వ తరగతి ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల(కొడంగల్) ప్రిన్సిపాల్ చంద్రశేఖర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అభ్యర్థులు తమ అర్హతను పరిశీలించుకుని తేది 18.12.2023 నుండి 06.01.2024 వరకు ఆన్‌లైన్‌లో రూ.100 రుసుము చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఒక ఫోన్ నంబర్‌తో ఒక దరఖాస్తు చేయాలన్నారు. అభ్యర్థి బదులుగా వేరే వారి ఫోటోలు పెట్టి దరఖాస్తు చేసినచో సెక్షన్ 416 ఆఫ్ ఐపిసి 1860 ప్రకారం క్రిమినల్ చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. ఇతర సమాచారం కొరకు హెల్ప్‌లైన్ నంబర్ 180042545878ను సంప్రదించాలని తెలిపారు. ఉదయం 10:30 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటుందన్నారు. 2023,24 విద్యా సంవత్సరంలో 4వ తరగతి చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థినీ,విద్యార్థులు ఈ సంవత్సరం 4వ తరగతి చదువుతున్నట్లుగా ధృవీకరణ పత్రం అనగా బోనఫైడ్, స్టడీ సర్టిఫికెట్‌ను అప్‌లోడ్ చేయాలని తెలిపారు.



భారీ శివలింగాన్ని పెకిలించి బయటకు తీసిన దృశ్యం

## గుప్త నిధుల కలకలం..

### భారీ శివలింగాన్ని పెకిలించి బయటికి తీసిన దుండగులు
### పోలీసులకు ఫిర్యాదు కేసు నమోదు

**యాలాల, డిసెంబరు 17, ప్రభాతవార్త:** యాలాల శివారులోని ఓ రైతు పొలంలో ఉన్న భారీ శివలింగాన్ని గుప్త నిధుల కోసం దుండగులు పెకలించారు. లింగాన్ని పూర్తిగా బయటికి తీసి పక్కకు వేయడంతో స్థానిక రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. భాధిత రైతు తెలిపిన వివరాల ప్రకారం..యాలాల గ్రామానికి చెందిన గంగుల వెంకట్‌రెడ్డి(జీవి రెడ్డి) గ్రామ శివారులో ఉన్న 9 ఎకరాల పొలాన్ని విశ్వనాథ్‌పూర్ గ్రామానికి చెందిన నర్సింహారెడ్డికి కౌలుకు ఇచ్చాడు. ప్రస్తుతం పొలంలో కంది, వరి పంటలను సాగుచేస్తున్నాడు. కాగా ఆదివారం ఉదయం పొలంలో కంది పంట ధ్వంసం అయినట్లు కౌలురైతు నర్సింహారెడ్డి గుర్తించారు. అనంతరం పంట పొలంలో ఉన్న భారీ శివలింగం పూర్తిగా పెకలించి బయటికి తీసిన ఆనవాళ్ళు గుర్తించాడు. జరిగిన విషయాన్ని పొలం యజమానికి వివరించాడు. ఘటన స్థలంలో మద్యం బాటిల్లు, కల్లు కవర్లను స్థానికులు గుర్తించారు. కాగా సుమారు 5 అడుగుల భారీ శివలింగాన్ని పెకిలించడానికి సుమారు ఆరు నుంచి ఏడు మంది అయితేనే సాధ్యమవుతుందని, ఇదంతా గుప్త నిధుల కోసం తవ్వకాలు జరగడం జరుగుతుంటాయని గ్రామస్థులు పేర్కొన్నారు. రైతు వెంకట్‌రెడ్డి ఈ విషయమై యాలాల పోలీసులకు పిర్యాదు చేశారు. పోలీసులు ఘటన స్థలంలో వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తులో ఉంది.

## ఆధ్యాత్మిక చింతన అలవార్చుకోవాలి
### ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, తదితరులు

**షాద్‌నగర్, డిసెంబర్ 17, (ప్రభాతవార్త) :** ఆధునిక కాలంలో ఆధ్యాత్మిక చింత ప్రతి ఒక్కరికి అవసరమని, దైవచింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. ఆదివారం ఫరూఖ్‌నగర్ మండలం ఎలికట్ట గ్రామ సమీపంలోని శ్రీభవాని మాత ఆలయంలో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, స్థానిక మాజీ ఎమ్మెల్యే ప్రతాప్‌రెడ్డి, ఉమ్మడి కొత్తూరు మండలాల మాజీ ఎంపీపీ శివశంకర్‌గౌడ్ తదితరులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను వేదమంత్రోచ్చరణలతో ఆశీర్వాదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... దైవ చింతన అలవార్చుకుంటే మానసిక ప్రశాంతత లభిస్తుందని అన్నారు. షాద్‌నగర్ నియోజకవర్గ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని ఆ అమ్మవారిని వేడుకోవడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన గొల్లగూడ



గొల్లగూడలో అయ్యప్ప మహాపడిపూజ దృశ్యం

**చేవెళ్ల,డిసెంబర్ 17 ప్రభాతవార్త :** చేవెళ్ల మండల పరిధిలోని గొల్లగూడ గ్రామం అయ్యప్ప నామస్మరణతో మార్మోగింది. ఆదివారం గొల్లగూడ గ్రామానికి చెందిన పాండుగౌడ్ అయ్యప్ప స్వామి 18వ మహాపడిపూజ ముకుందం గురుస్వామి ఆధ్వర్యంలో జంగిరెడ్డి భజన బృందంచే అంగరంగవైభవంగా నిర్వహించారు. గురుస్వాములు పాడిన పాటలు భక్తులను ఆకట్టుకున్నాయి. అయ్యప్ప స్వాములు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అయ్యప్ప స్వాములకు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప స్వాములు, భక్తులు,గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## షాబాద్‌లో ప్రభుత్వ జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేయాలి

**షాబాద్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** షాబాద్‌లో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని బీజేవైఎం మండల అధ్యక్షుడు దాదె మహేష్ అన్నారు. ఆదివారం ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.... గత ప్రభుత్వం ఉన్నప్పుడు షాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల, డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎన్నోసార్లు స్థానిక ప్రభుత్వ కార్యాలయాల ముందు ధర్నాలు, రాస్తారోకోలు, పాదయాత్రలు చేశామని, కానీ గత ప్రభుత్వ నాయకులు ఎవరు పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా కొత్త ప్రభుత్వం షాబాద్ మండలంపై ప్రత్యేక దృష్టిపెట్టి జూనియర్, డిగ్రీ కళాశాల, షాబాద్‌లో కమ్యూనిటీ హెల్త్ కేర్ సెంటర్ చేయాలని బీజేవైఎం తరపున డిమాండ్ చేస్తున్నారు.

## సీఎం రేవంత్‌రెడ్డిపై కొడంగల్‌వాసుల కోటి ఆశలు




కొడంగల్ శివారులో ఏర్పాటు చేసిన బోర్డు

**కొడంగల్,డిసెంబర్ 17ప్రభాతవార్త**

రాష్ట్ర ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టడంతో అభివృద్ధిలో కొడంగల్ కొత్త పుంతలు తొక్కనుందని కొడంగల్ వాసుల్లో కోటి ఆశలు చిగురిస్తున్నాయి.ఎన్నికలకు ముందు పీసీసీ హోదాలో పలు రోడ్‌షోలలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అభివృద్ధిలో గజ్వేల్,సిద్దిపేట్,సిరిసిల్లా తరహాలో కొడంగల్‌ను అభివృద్ధి చేస్తానని హామీలు ఇచ్చారు.అందులో కీలకమైన హామీలు ఉన్నాయి.ప్రస్తుతం కొడంగల్‌కు ప్రాతినిత్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో అభివృద్ధిలో కొడంగల్ రోల్‌మాడల్‌గా నిలువనుందని ఈ ప్రాంత వాసులు ఎంతో ఆశతో ఎదరుచూస్తున్నారు.అందులో భాగంగా కొడంగల్‌లో నిరంతర విద్యుత్ సరఫరా జరిగేలా సీఎంఓ కార్యాలయం నుంచి ఇదివరకే విద్యుత్‌శాఖ అధికారులకు మౌఖిక ఆదేశాలు జారీ చేయడం జరిగింది.సీఎం హామీల అములు కోసం ఇదివరకే కొడంగల్ అభివృద్ధి సంస్థ(కడ) ఏర్పాటుకు కసరత్తులు చకచకా జరుగుతున్నాయి.ఇందుకోసం కొడంగల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని ఆర్అండ్‌బీ



కొడంగల్ ముఖచిత్రం

### అనేక డిమాండ్‌లపై సీఎం హామీలు
### అమలైతే రాష్ట్రంలోనే కొడంగల్‌కు గుర్తింపు



అధికారులు పరిశీలించడం జరిగింది. ఈ క్రమంలో ప్రత్యేక అధికారిని నియమించేందుకు కసరత్తులు కొనసాగుతున్నట్లు విశ్వసనీయ సమాచారం. సదరు అధికారి నేతృత్వంలో కొడంగల్ నియోజకవర్గ అభివృద్ధికి చేపట్టాల్సిన పనులపై ప్రత్యేక ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వానికి నివేదికలు పంపనున్నట్లు తెలుస్తుంది.కొడంగల్ అభివృద్ధికై చేపట్టాల్సిన అంశాలపై ప్రభాతవార్త అందిస్తున్న కథనం.

### 69 జీఓ అమలుతో కొడంగల్‌కు సాగునీరు

ఎలాంటి సాగునీటి వసతులు లేని కొడంగల్ ప్రాంతానికి 69జీఓతో నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకం ద్వారా సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇందుకోసం 2009లోనే పథకానికి సంభందించి రూ.220 కోట్ల వ్యయంతో చేపట్టనున్న నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి ఎమ్మెల్యే హోదాలో మంజూరీ చేయించారు. అంతేగాక అప్పటి ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి రోశయ్యతో మాట్లాడి పథకం సర్వే నిమిత్తం రూ.20కోట్లు మంజూరీ చేయించారు.కాగా 2014లో అప్పటి టీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పడ్డాక 69జీఓను మరుగున పడేసి పాలమూరు-రంగారెడ్డి పథకాన్ని తెరపైకి తీసుకువచ్చారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాటు కొడంగల్‌కు ప్రాతినిత్యం వహిస్తున్న రేవంత్‌రెడ్డి సీఎం కావడంతో నారాయణపేట్-కొడంగల్ ఎత్తిపోతల పథకంపై మళ్ళీ ఆశలు చిగురిస్తున్నాయి.

### వికారాబాద్-కృష్ణా రైల్వేలైన్ ఏర్పాటు

ఎలాంటి రైల్వేలైన్ సౌకర్యంలేని కొడంగల్ నియోజకవర్గానికి వికారాబాద్-క్రిష్ణా రైల్వేలైన్ ఏర్పాటు చేస్తే ఈ ప్రాంతానికి ఎంతోమేలు చేకూరుతుంది.నియోజకవర్గంలో అధిక సంఖ్యలో ఉన్న గిరిజనుల రవాణా సౌకర్యంతో పాటు ఈ ప్రాంతంలో సుద్దపు గనులు అధిక ఉండడం రైల్వేలైన్ కలిసొచ్చే అవకాశం ఉంది.గతంలో కొడంగల్ ఎమ్మెల్యే హోదాలో రేవంత్‌రెడ్డి పలుమార్లు రైల్వేలైన్ అంశంపై కేంద్రం దృష్టికి తీసుకువెళ్ళడంతో అప్పట్లోనే సానుకూలంగా స్పందించిన కేంద్రం రాష్ట్ర ప్రభుత్వానికి 50శాతం నిధుల వాటా చెల్లించాలని ఆదేశించినా గత బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టడం మూలంగా వికారాబాద్-క్రిష్ణా రైల్వేలైన్ అంశం మరుగున పడింది.ప్రస్తుతం సీఎం హోదాలో రేవంత్‌రెడ్డి రైల్వేలైన్ ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తే సుద్దపు గనుల ముడి సరుకు రవాణాతో పాటు ఈ ప్రాంత వాసులకు ఎంతో మేలు చేకూరే అవకాశాలు ఉన్నాయి.

### సిమెంట్ ఫ్యాక్టరీల ఏర్పాటు

కొడంగల్ నియోజకవర్గంలో ఉపాధి అవకాశాలు లేకపోవడంతో ఈ ప్రాంతం నుంచి ముంబాయి,పూణే, హైద్రాబాద్,షోలాపూర్,దుబాయి తదితర ప్రాంతాలకు అధిక సంఖ్యలో వలసలు వెళ్తుంటారు.కొడంగల్ ప్రాంతంలో అనేకంగా సుద్దపు గనుల నిక్షేపాలు పుష్కలంగా ఉండడంతో ఈ ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని గతంలో ఎమ్మెల్యే హోదాలు రేవంత్‌రెడ్డి ప్రస్తావించారు. ముఖ్యంగా గండ్లెపల్లి(ధర్మాపూర్), ఇందనూర్,కస్తూర్‌పల్లి, రావులపల్లి, చంద్రకల్ తదితర ప్రాంతాల్లో సుద్దపు గనులు ఉండడంతో గతంలోనే సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటుకు రేవంత్‌రెడ్డి కృషి చేసినా ముందుకు సాగలేదు. ప్రస్తుతం సీఎం హోదాలో కొడంగల్ ప్రాంతంలో సిమెంట్ ఫ్యాక్టరీలు ఏర్పాటుపై ప్రత్యేక చొరవ తీసుకుంటే ఎంతోమంది యువకులకు ఉపాధి అవకాశాలు లభించడంతో పాటు వలసలు నివారించే అవకాశాలు మెండుగా ఉన్నాయి.

### కొడంగల్‌లో 100 పడకల ఆసుపత్రి

ప్రతి నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రిని నిర్మించాలని గత ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినా కొడంగల్‌లో 50 పడకల ఆసుపత్రి అందుబాటులో ఉంది.కర్నాటక రాష్ట్ర సరిహద్దుతో పాటు హైద్రాబాద్-బిజాపూర్ (ఎన్‌హెచ్-163),భూత్పూర్-చించోళీ(ఎన్‌హెచ్-167) రెండు జాతీయ రహదారులు ఉండడంతో కొడంగల్ నియోజకవర్గ కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి నెలకొల్పాసిన అవసరం ఎంతైనా ఉంది.

### విద్యా కళాశాలల ఏర్పాటుకు కృషి చేయాలి

అన్ని రంగాల్లో వెనుకబడిన ప్రాంతంగా కొనసాగుతున్న కొడంగల్ విద్యారంగంలోను వెనుకబాటుకు గురైంది.ఎంతో మంది పేద యువకులు ఉన్నత విద్య కోసం సుదూర ప్రాంతాలకు వెళ్ళి చదువుకునేందుకు ఆర్థిక స్థోమత లేక మధ్యలోనే చదువులకు స్వస్తి చెబుతున్నారు.ఇంటర్ విద్య వరకే కళాశాలలు ఉన్న కొడంగల్ ప్రాంతంలో గతంలో ఎమ్మెల్యే హోదాలో రేవంత్‌రెడ్డి కొడంగల్‌లో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోస్గిలో పాలిటెక్నిక్ కళాశాలలు మంజూరీ చేయించారు. ప్రస్తుతం సీఎం హోదాలో కొడంగల్‌లో పీజీ,నర్సింగ్ కళాశాలలతో పాటు ఇంజనీరింగ్ కళాశాలలు ఏర్పాటు చేయిస్తే ఈ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పేట్రేగిపోతున్న ఇసుక మాఫీయా !

**నిద్రావస్థలో సంబంధిత అధికారులు**
**ప్రభుత్వం నిబంధనలు విధించినా**
**పట్టించుకోని అక్రమార్కులు**
**ప్రభుత్వ ఆదాయానికి భారీ గండి**

**పెద్దేముల్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** అక్రమ ఇసుక రవాణాలో ఇసుకాసురులు పేట్రేగిపోతున్నారు. రాత్రి పగలు తేడా లేకుండా ఇష్టానుసారంగాదర్జాగా ఇసుకను తరలిస్తున్న అడిగే నాథుడేలేరని పలువురు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. రాత్రింబవళ్ళు అక్రమ ఇసుక రవాణాతో కంటికి కునుకులేకుండా పోతోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. పెద్దేముల్ మండలంలోని రుక్మాపూర్, రెగొండి, మదనంతాపూర్, మన్‌సాన్‌పల్లి, కొండాపూర్ తదితర గ్రామాల సమీపంలోని వాగు నుంచి అక్రమంగా ఇసుకను తోడేస్తున్నారు. ఇసుక రవాణకు మంబాపూర్ అడ్డాగా మారడంతో ఇసుకాసురుల వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా సాగుతోంది, గతంలో మంబాపూర్‌లో పోలీసు చెక్‌పోస్టు ఏర్పాటు చేయడంతో ఇసుక అక్రమ రవాణకు అడ్డుకట్ట వేయగలిగారు. ప్రస్తుతం చెక్‌పోస్టు ఎత్తి వేయడంతో ఇసుక మాఫీయాకు అడ్డు అదుపు లేకుండా పోయిందని పలువురు ఆరోపిస్తున్నారు. ప్రదానంగా మండల కార్యాలయాల ముందు నుంచి ఇసుకను తరలిస్తున్న సంబందిత రెవిన్యు, పోలీసు అధికారులు చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు గుసగుసలాడుకుంటున్నారు. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.600 చెల్లించి ఇసుకను తరలించాలని ప్రభుత్వం ఆదేశాలు ఉన్న వాటిని ఖాతరు చేయడంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఫలితంగా ప్రభుత్వ ఆదాయానికి భారీగా గండిపడుతోందని ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తే చర్యలు తప్పవని సంబందిత అధికారులు పదే పదే హెచ్చరిస్తున్నారే తప్పా, చర్యలు తీసుకోవడంలేదని ఆరోపిస్తున్నారు. జిల్లా టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు చేసి కేసులు నమోదు చేశారే తప్పా స్థానిక సంబందిత అధికారులు అక్రమ ఇసుక రవాణకు అడ్డుకట్టవేయలేకపోతున్నారని పలువురు పేర్కొంటున్నారు.





నిల్వ చేసిన ఇసుక డంపులు, పట్టుబడ్డ ఇసుక ట్రాక్టర్ (ఫైల్)



మేడ్చల్ నియోజకవర్గ ఎమెల్యే మల్లారెడ్డిని సన్మానిస్తున్న వేద పండుతులు,గురుస్వాములు

### ముగిసిన శ్రీ హరిహర పుత్ర వరాల అయ్యప్ప స్వామి
## విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

**కీసర,డిసెంబరు17,ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కీసరలో శ్రీ హరిహర పుత్ర వరాల అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్స వాలు ఆదివారంతో ఘనంగా ముగిసాయి.ఉదయం 4.30 నిమిషాలకు గణపతి పూజతో మొదలై గో పూజ,గర్తన్యాసం,కళన్యాసం,6.45 నిమిషాలకు శ్రవణ నక్షత్రంలో తులా లగ్నంలో " శ్రీ హరిహర పుత్ర వరాల అయ్యప్ప స్వామి యంత్ర,విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం,ప్రాణ ప్రతిష్ట, నేత్రోన్మేలనం,బలిహరణ,రాత్రి 7 గంటలకు పదునెట్టాబడి కార్యక్రమంలో పూజా కార్యక్రమాలు ఘనంగా ముగిసాయి.గత మూడు రోజుల నుండి నిర్వహించిన పూజా కార్యక్రమాలు గురుస్వామి నల్ల బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ పూజా కార్యక్రమాలకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.భారిగా తరలివచ్చిన భక్తులకు 4వ వార్డు సభ్యురాలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి అన్నదానం చేశారు.అనంతరం అయ్యప్ప స్వామి దేవాలయాన్ని నిర్మించడానికి స్థలాన్ని ఇచ్చిన మచ్చాని జంగయ్య,నాగమణి దంపతులను వేద పండితులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ నాయకపు మాధురి వెంకటేష్,ఎంపిటిసి తటాకం నారాయణశర్మ, పిఏసిఎస్ చైర్మన్ రామిడి ప్రభాకర్‌రెడ్డి,ఉపసర్పంచ్ తటాకం లక్ష్మణ్‌శర్మ, మాజీ ఎంపిటిసిలు బెటిదె రమేష్ గుప్తా,మచ్చాని జంగయ్య యాదవ్,వార్డు సభ్యులు,గ్రామస్తులు పాల్గొన్నారు,

**అయ్యప్ప స్వామి సేవలో ఎమ్మెల్యే మల్లారెడ్డి**

శ్రీ హరిహర పుత్ర వరాల అయ్యప్ప స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల్లో ఆదివారం మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు.వేద పండితులు వేద మంత్రోచ్చరణలతో స్వాగతం పలికి శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

## రెండు బైకులు ఢీకుని.. ఒకరి మృతి

**మర్పల్లి డిసెంబర్ 17 ప్రభాతవార్త :** ఎదురుఎదురుగా వస్తున్న రెండు బైకులు ఢీకోని ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం నాడు రాత్రి మర్పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చెసుకుంది.వివరాల్లోకి వెలితే మోమిన్‌పెట్ మండలానికి చెందిన పులిగారి నర్సింలు, మల్లేషంలు కోటమర్పల్లి గ్రామంనుండి బైక్ పైన వస్తుండగా కోటమర్పల్లి గ్రామానిక చెందిన పోచారం శ్రీనివాస్,రాజులు మర్పల్లి నుండి కోటమర్పల్లికి వెళ్తుండగా రెండు బైకులు ఢీ కోనగా పులిగారి నర్సింలు అక్కడిక్కడే మృతి చెందగా తుడేం మలేషంకి తీవ్రగాయాలై చికిత్స పోందుతున్నడు. పోచారం రాజు శ్రీనివాస్‌లు అతివేగంగా వచ్చి తన తండ్రిని బైక్‌ని ఢీ కోట్టారని మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మెరకు ఎస్.ఐశ్రీదర్‌రెడ్డి కేసు నమోదు చెసుకుని దార్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## విద్యానగర్‌లో మౌలిక వసతులు కల్పించండి
### కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాష

**ఆమనగల్లు, డిసెంబర్17, ప్రభాతవార్త:** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలోని విద్యానగర్ కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పాష కోరారు. మౌలిక వసతుల లేమితో కాలనీ అభివృద్ధి కుంటుపడిందని, దశాబ్దాల కాలంగా ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం విద్యానగర్ కాలనీ సంక్షేమ సంఘం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సమావేశంలో కాలనీ అభివృద్ధి, భవిష్యత్తు కార్యాచరణ గురించి చర్చించారు. ముఖ్యంగా కాలనీలో సీసీరోడ్లు, మిషన్ భగీరథ మంచినీళ్ళు, వీధి దీపాలు, అంతర్గత మురుగు కాల్వల సమస్యలపై చర్చించారు. ఈసందర్భంగా పాలకులు, అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి కాలనీ అభివృద్ధికి పాటుపడాలని తీర్మానించారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు మనుపాడు జంగయ్య, కోశాధికారి జిల్లెల సుదర్శన్‌రెడ్డి, సలహాదారులు పాండునాయక్, పత్యానాయక్, మ్యాక వెంకటేశ్వర్‌రెడ్డి, పర్వతాలు, ఆరీఫ్, రమేశ్, రాఘవాచారి, మాల్యానాయక్, తావుర్యానాయక్, రాములు, సురేష్‌రెడ్డి ఉన్నారు.

## అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు ఘన స్వాగతం

### శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్ నారాయణరెడ్డి, పార్టీ శ్రేణులు

**వికారాబాద్,డిసెంబర్ 17, ప్రభాతవార్త:** అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఆదివారం పలు శుభకార్యాల్లో పాల్గొనేందుకు వికారాబాద్‌కు వచ్చారు. స్పీకర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన తరువాత తొలిసారి వికారాబాద్‌కు రావడంతో పెద్ద ఎత్తున కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, అభిమానులు తరలివచ్చి ఘనంగా స్వాగతం పలికారు. పట్టణంలోని స్థానిక ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద ప్రసాద్‌కుమార్ రాకను పురస్కరించుకుని అధికారులు స్వాగతం పలికారు. ప్రసాద్‌కుమార్ మొదటగా పోలీసుల గౌరవ వందనం స్వీకరించి అమర వీరుల స్థూపం వద్ద పుష్పగుచ్చం ఉంచి నివాళ్ళు అర్పించారు. ప్రసాద్‌కుమార్ కు జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి, వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి పుష్పగుచ్చం ఇచ్చి శుభాకంక్షలు తెలిపారు. శ్రీ అనంత పద్మనాభ స్వామి ఆలయ అర్చకులు శేషగిరి, పద్మనాభంలు ప్రసాద్‌కుమార్‌కు వేధ మంత్రోశ్చరణతో ఆశీర్వచనం చేసి జ్ఞాపికను అందజేశారు. అనంతరం వికారాబాద్ క్లబ్‌లో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో దివ్యాంగులకు ఉపకరణాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ చిగుర్లపల్లి మంజుల, కాంగ్రెస్ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.ఎ. వాహీద్ మియా, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు సత్యనారాయణ, హన్మంత్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, రాంచెంద్రారెడ్డి, చిగుర్లపల్లి రమేశ్‌కుమార్, చాపల శ్రీనివాస్, రఘుపతిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు ఘనంగా సత్కారాలు

**చేవెళ్ల, డిసెంబర్ 17 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు చేవెళ్ల మండలంలో ఘన స్వాగతం పలికారు. స్పీకర్‌గా ఎన్నికైనా తొలిసారిగా చేవెళ్లకు గడ్డం ప్రసాద్ కుమార్ రావడంతో చేవెళ్ల నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామెన భీంభరత్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం చేవెళ్లలోని మోడల్ కాలనీలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో ఆయనకు పూలు, శాలువాలతో పెద్ద ఎత్తున్న సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలను ఉద్దేశించి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ మాట్లాడుతూ....చేవెళ్ల నియోజకవర్గం అభివృద్ధికి నిరంతరం కృషిచేస్తానని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయాలని, రాబోయే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో అధిక సంఖ్యలో స్థానాలను కైవసం చేసుకునే దిశగా అడుగులు ముందుకు వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




అమరుల స్థూపం వద్ద పుష్ప గుచ్చం ఉంచి నివాళ్ళు అర్పిస్తున్న అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, అసెంబ్లీ స్పీకర్‌కు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలుపుతున్న జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి





స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను సన్మానిస్తున్న చేవెళ్ల కాంగ్రెస్ నాయకులు



మాజీ కార్పొరేటర్ వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకల్లో ఎమ్మెల్యే వివేకానంద

## ఘనంగా మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు

దుండిగల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త : దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలో నిర్వహించిన కుత్బుల్లాపూర్ డివిజన్ మాజీ కార్పోరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలకు హ్యాట్రిక్ ఎమ్మెల్యే కెపి వివేకానంద ముఖ్య అతిథిగా హాజరై మాజీ కారో ్పరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావుకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కెపి వివేకానంద మాట్లాడుతూ సౌమ్యశీలి, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు బొడ్డు వెంకటేశ్వరరావు ఆయురారోగ్యాలతో సుఖ సంతోషాలతో జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## కర్మన్‌ఘాట్‌లో నేడు వీరభద్రస్వామి కళ్యాణ మహోత్సవం



శ్రీ వీరభద్రస్వామి కళ్యాణ మహోత్సవ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సేవా సమితి ప్రధాన కార్యదర్శి కాసుల వినోద్ తదితరులు

హైదరాబాద్, డిసెంబరు 17 ప్రభాతవార్త : మన సంస్కృతి, సంప్రదాయాలను, భారతీయ వారసత్వ సంపదను భావితరాలకు అందించాల్సిన అవసరం మనందరిపై ఉందని శ్రీ వీరభద్ర స్వామి సేవా సమితి ప్రధాన కార్యదర్శి కాసుల వినోద్ అన్నారు. ఆదివారం నింబోలిఅడ్డలో జరిగిన కార్యక్రమంలో శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఈనెల 18న సోమవారం ఉదయం 9 గంటలకు కర్మన్‌ఘాట్ ఏపిఆర్ గార్డెన్స్‌లో జరగనున్న భద్రకాళి సమేత వీరభద్ర స్వామి కల్యాణ మహోత్సవ వేడుకల ఆహ్వాన పత్రికలను భక్తులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వామివారి కళ్యాణ మహోత్సవంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. మహబుబాబాద్ జిల్లా కురవికి వెళ్లి శ్రీ వీరభద్రస్వామి కల్యాణాన్ని తిలకించలేకపోయిన భక్తులు ఈ కల్యాణ వేడుకల్లో పాల్గొనడానికి మంచి అవకాశం అన్నారు. ఈ కార్యక్రమంలో అర్థోజు చక్రపాణి, ఆర్థోజు ప్రకాష్, మధుసూదన్ చారి, మాధవ్‌చారి, టి.భాస్కర్‌రాజ్‌గౌడ్, ఆర్. రాజేష్‌కుమార్, బి.ఉపేందర్, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

## అయ్యప్ప పడిపూజలో పాల్గొన్న కార్పొరేటర్



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్పపడిపూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే రఘునందన్ రావ్, మోండా కార్పోరేటర్ కొంతం దీపిక తదితరులు


కంటోన్మెంట్,డిసెంబర్ 17 ప్రభాతవార్త: కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం నారాయణ గూడలోని కేశవ్ మెమోరియల్ హై స్కూల్‌లో నిర్వహించిన అయ్యప్ప మహాపడిపూజ వేడుకలకు మాజీ మంత్రి ఈటెల రాజేందర్, మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావ్, మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపికలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సఖీ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్యాన్సర్ పేషంట్లకు మందులు, ఆహార పదార్థాలు పంపిణీ



ఆహారాన్ని పంపిణీ చేస్తున్న సఖీ సేవా ఫౌండేషన్ సభ్యులు

ఫిల్మ్‌నగర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త : జూబ్లీహిల్స్ పరిధిలోని బసవతారక క్యాన్సర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్యాన్సర్ పేషంట్లకు సఖీ సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మెడిసిన్ దుస్తులు పంపిణీ, ఆహార పదార్థాలను పంపిణీ చేసి తన ఔదార్యాన్ని చాటుకుంది. బసవతారకం క్యాన్సర్ హాస్పిటల్ పరిసర ప్రాంతాలలోని కెబిఆర్ పార్క్ వద్ద అభాగ్యులకు, అనాధలకు కూడా దుస్తుల పంపిణీతోపాటు, ఆహార పదార్థాలను సఖీ సేవా ఫౌండేషన్ అందజేసింది. ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శంకర్, సభ్యులు కిరణ్, కిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను సన్మానిస్తున్న బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ 7.వ,వార్డు ప్రతినిధులు పాపయ్య యాదవ్ తదితరులు

## వెంకటేశ్వర స్వామి దేవాలయంలో వైకుంఠ ఏకాదశి మహోత్సవాలు



చార్మినార్, డిసెంబరు 17 ప్రభాతవార్త : చార్మినార్ సమీపంలోని చౌక్ మైదాన్ ఖాన్ శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో డిసెంబరు నెల 23వ తేదీ తేదీ నుంచి జనవరి 16వ తేదీ వరకు శ్రీ వైకుంఠ ఏకాదశి,కరిమ మహోత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు మందిరం ప్రధాన పూజారి శృంగారం రమణాచార్యులు,అర్చకులు శృంగారం ఆత్రేయ చార్యులు తెలిపారు.శ్రీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా శనివారం తెల్లవారు జామున 3 గంటలకు స్వామి వారికి అభిషేకం,4 గంటలకు తోమాల సేవ, 6 గంటలకు నేత్ర దర్శనం, హారతి,6.30 గంటలకు స్వామి వారి వైకుంఠ ద్వార దర్శనం,పల్లకి ఊరేగింపు ఆలయ తిరువీధులలో అతి వైభవంగా జరుగుతుందని వారు తెలియజేశారు.ఉదయం 10 గంటలు నుంచి రాత్రి 11 గంటలు వరకు నాద నీరాజనం, సాంస్కృతిక కార్యక్రమాలు,రాత్రి 12 గంటలు పవలింపు సేవ తదితర కార్యక్రమాలు జరగనున్నాయని వారు తెలిపారు. 26వ తేదీన నమా ళ్ వార్ పరమ పద మహోత్సవం, జనవరి 14వ తేదీన శ్రీ గోదాదేవి కళ్యాణం,16వ తేదీన కరినోము మహోత్సవం జరుగుతుందని వారు తెలియజేశారు.23వ తేదీ శనివారం జరగనున్న శ్రీ ముక్కోటి ఏకాదశి సందర్భంగా శ్రీ బాలాజీ మందిరాన్ని అందంగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని సేవించి తరించగలరని వారు కోరుతున్నారు.

## కల్యాణ లక్ష్మీ చెక్కులు అందించిన ఎమ్మెల్యే



అల్వాల్, డిసెంబరు 17 ప్రభాతవార్త: అర్హులైన లబ్ధిదారులు అందరికి కల్యాణ లక్ష్మి చెక్కులు అందుతాయని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. ఆదివారం అల్వాల్, వెంకటాపురం డివిజన్ పరిధిలోని లబ్ధిదారులకు స్థానిక కార్పొరేటర్లు చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, సబిత అనిల్ కిషోర్‌లు సమక్షంలో ఎమ్మెల్యే చెక్కులు అందించారు. బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కల్యాణ లక్ష్మి, షాదీ ముభారక్ పథకాలు ద్వారా మంజూరైన చెక్కులను దశల వారీగా అందిస్తామని ఆయన వివరించారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని సమస్యలు పరిష్కారిస్తానని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధికి ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నేతలు అనీల్ కిషోర్, నేమూరి శ్రీధర్ గౌడ్, విఎన్ రాజు, కన్నా, సురేష్, వీణ, అనిత తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు



అఫ్జల్‌గంజ్ ,డిసెంబర్ 17 ప్రభాతవార్త: మాసబ్ ట్యాంకు పోచమ్మబస్తీ ప్రజలు డాక్టర్ బాబా సాహెబ్ బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి 65వ ఆదివారం పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు.ఈసందర్భంగా టిఎన్‌జిఓ విద్యాశాఖ అధ్యక్షులు కె.ఆర్.రాజ్‌కుమార్ మాట్లాడుతూ గత 66 వారాలుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్నట్లు తెలిపారు. రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు, భాద్యతలు నేటి యువత,యువకులు తెలుసు కోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.ఈకార్యక్రమంలో బస్తీవాసులు రవీందర్,వెంకటేష్,జి,మహేష్‌గౌడ్, ఆర్.కె.శ్రీనివాస్,వేణు,ప్రవీణ్,శ్రీహరి గౌడ్,ప్రతాప్ గౌడ్, శ్రీకాంత్.శ్రీనివాస్,జబ్బార్, అబ్దుల్లా,యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రేవంత్‌రెడ్డి, మంత్రి దామోదరకు కృతజ్ఞతలు

సైఫాబాద్, డిసెంబరు 17 ప్రభాతవార్త: ఖాళీగా ఉన్న మొత్తం 7031 స్టాఫ్ నర్సుల పోస్టుల భర్తీకి కాంగ్రెస్ ప్రభుత్వం అంగీకరించడం పట్ల తెలంగాణ రాష్ట్ర నర్సింగ్ జెఎసి హర్షం వ్యక్తం చేసింది. ఈమేరకు జెఎసి నాయకులు బి.వెంకటేష్, సంతోష్ ఆదివారం ఒక ప్రకటన చేస్తూ గత ఆగస్టు మాసంలో 5204 స్టాఫ్ నర్సు ఉద్యోగాల కోసం పరీక్షలు నిర్వహించారని వారు తెలిపారు. కాని మరో 1827 అదనపు పోస్టులకు ఆర్థిక శాఖ క్లియరెన్స్ ఇచ్చిందన్నారు. దీంతో మొత్తం 7031 పోస్టుల కోసం ఫలితాలు వెలవరించి అర్హులకు ఉద్యోగాలు ఇవ్వాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహాకు విజ్ఞప్తి చేయగా పూర్తి స్థాయి పోస్టులు భర్తీకి ప్రభుత్వం సుముఖత వక్తం చేసిందని వారు తెలిపారు. 5 రోజుల్లోనే సమస్యను పరిష్కరించడం పట్ల వారు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, దామోదర రాజనర్సింహాకు, ప్రిన్సిపల్ సెక్రటరీకి వారు కృతజ్ఞతలు తెలిపారు. త్వరలో సిఎంను, మంత్రిని కలిసి ఘనంగా సత్కరించుకుంటామన్నారు.

## వైభవోపేతంగా ఆటా అంతర్జాతీయ సాహితీ సదస్సు-2023

**అమెరికా భారతి త్రైమాసిక వెబ్ పత్రికను ప్రతీనెలా ప్రింట్ పత్రికగా తీసుకురావాలి : ఆచార్య కొలకలూరి ఇనాక్**




సదస్సుల ప్రారంభోత్సవ సభలో ప్రసంగిస్తున్న కొలకలూరి ఇనాక్, నందినిసిధారెడ్డి, తనికెళ్లభరణి

నాంపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త : ప్రవాసాంధ్రులుగా అమెరికాకు వెళ్లిన తెలుగువారు తెలుగుభాష, సాహిత్యం, సాంస్కృతిక, సంప్రదాయాలను అక్కడ వారి పిల్లలకు, తెలుగు వారికి అందజేసే ఒక వారధిగా 33ఏళ్లక్రితం ఆటాను ప్రారంభించి అక్కడి వారికందించడం హర్షదాయకమన్న తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి ప్రతీ రెండుసంవత్సరాలకొకసారి అమెరికాలో మహాసభలు నిర్వహించడం, డిసెంబరు నెలలో రెండు మూడువారాలపాటు ఉభయ తెలుగురాష్ట్రాల్లో పర్యటించి వివిధ కార్యక్రమాలు నిర్వహించడం ప్రశంసనీయమని ఆటా సేవలను కొనియాడారు. ఆటా అమెరికాలో క్రమం తప్పకుండా నిర్వహిస్తున్న అమెరికా భారతి త్రైమాసిక వెబ్ పత్రికను, మాసపత్రికగా ప్రింట్ మాధ్యమ పత్రికగా తీసుకురావాలని, అందుకు తమ పూర్తి సహాయసహకార ముంటుందని ఆచార్య కొలకలూరి ఇనాక్ సూచించారు. తెలుగుభాష అమెరికాలో నానాటికీ ప్రాచుర్యం పొందుతూ శరవేగంగా వ్యాప్తిచెందుతున్న భాషగా నిలవడం, అందుకు ఆటా సహకారాన్ని శ్లాఘించారు. అమెరికా తెలుగు సంఘం (ఆటా) ఆధ్వర్యంలో నాంపల్లి పబ్లిక్ గార్డెన్స్ వద్దనున్న పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని డా. నందమూరి తారక రామారావు కళామందిరంలో ఆటో కమిటీ లిటరరీ ఛైర్ వేణు నక్షత్రం నిర్వహణ, శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ సభాధ్యక్షతన జరిగిన ఆటా అంతర్జాతీయ సాహితీ సదస్సు-2023 ప్రారంభోత్సవ సభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు డా. నందిని సిధారెడ్డి, విశిష్ట అతిథులుగా తనికెళ్ళ భరణి, ఆటా అధ్యక్షురాలు మధు బొమ్మినేని, అధ్యక్షుడు, వేడుకల ఛైర్ ఎలెక్ట్ జయంత్ చల్లా, కోఛైర్ వేణు సంకినేని, రాజేశ్వరరావు, ఇండియా కోఆర్డినేటర్ సుబ్బారెడ్డి, పాల్గొని జ్యోతిప్రకాసనం చేసి ఆటా అంతర్జాతీయ సాహితీ సదస్సును లాంఛనంగా ప్రారంభించి ప్రసంగించారు.

## రైతుబంధులో జరిగిన దోపిడిపై విచారణ జరిపి సొమ్ము రికవరీ చేయాలి

చిక్కడపల్లి,డిసెంబరు 17 ప్రభాతవార్త: రైతుబంధు పేరుతో గత బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ సొమ్ము కాజేసిన మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారుల నుంచి వందల కోట్ల రూపాయలను రికవరీ చేయాలని బహుజన లెఫ్ట్‌ఫ్రంట్(బిఎల్ఎఫ్) రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ కాంగ్రెస్‌ప్రభుత్వానికి విజ్ఞప్తిచేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో రైతుబంధు పేరుతో గత బిఆర్ఎస్ ప్రభుత్వం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు, ఎమ్మెల్సీలు, రియల్‌ఎస్టేట్ వ్యాపారులు రైతుబంధు ముసుగులో రైతుబంధు పేరుతో ప్రభుత్వ ఖజానాకు కన్నం వేసిన అందరిపై ఆర్థిక నేరాలకు పాల్పడిన సెక్షన్ల ప్రకారం కేసులు నమోదు చేసి సొమ్మును రికవరీ చేయాలని సిఎం రేవంత్‌రెడ్డిని డిమాండ్ చేశారు.

## అభివృద్ధి పనిచేసే పూర్తి చేసేలా చర్యలు

**మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

కంటోన్మెంట్, డిసెంబర్ 17 ప్రభాతవార్త: అభివృద్ధి పనులను త్వరిత గతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మాజీ మంత్రి,ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ తెలిపారు. సనత్ నగర్ ఎమ్మెల్యేగా 3వ ఎసారి భారీ మెజార్టీతో విజయం సాధించినందుకు ఆదివారం మారేడ్‌పల్లిలోని తన నివాసంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు లోకనాథం, అనితా ప్రభాకర్‌లు మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పోరేటర్ శేషుకుమారి, బిఆర్ఎస్ నాయకులు నవ్యభవానీ, వి.ప్రసాద్, సంపత్, రాజు ముదిరాజ్ పాల్గొన్నారు.

**అయ్యప్ప పూజలోపాల్గొన్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్..**

సికింద్రాబాద్ రెజిమెంటల్ బజార్‌లోని కీస్ హై స్కూల్‌లో శ్రీధర్మశాస్త్ర భక్త బృందం ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహ పడిపూజ వేడుకలకు మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ



మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను అభినందిస్తున్న కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులు జక్కుల మహేశ్వర్ రెడ్డి తదితరులు

కార్యక్రమంలో సికింద్రాబాద్ పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి తలసాని సాయికిరణ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అత్తెల్లి అరుణ శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ నాయకులు వెంకట నారాయణ,రాజు, ఎర్రం శ్రీను, ప్రపుల్, శివ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 23వ సయ్యద్ యూసఫ్ ఆలీ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

సైఫాబాద్, డిసెంబరు 17 ప్రభాతవార్త: 2వ సయ్యద్ యూసఫ్‌ఆలీ పహిల్వాన్ జ్ఞాపకార్థం ఈ నెల 22, 23, 24 తేదీలలో సయ్యద్ యూసఫ్ ఆలీ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్-2023 పోటీలను మల్లేపల్లి గ్రౌండ్‌లో నిర్వహిస్తున్నామని నిర్వాహకులు సయ్యద్‌ఆజామ్ పహిల్వాన్, హైదరాబాద్ అమేచ్యూర్ రెజ్లింగ్ అసోసియేషన్ ప్రతినిధులు శైలేందర్‌సింగ్, కిరణ్‌యాదవ్, నాజర్‌కోలాకి, మహ్మద్ అస్లాం తెలిపారు. ఈ మేరకు ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ పోటీలకు సంబంధించిన ఆహ్వాన పత్రికలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. ఈ ఛాంపియన్ షిప్ పోటీలలో జూనియర్ విభాగంలో 35 కేజీల నుంచి 46 కేజీల బరువు, సీనియర్ విభాగంలో 50 కేజీల నుంచి 96 ప్లస్ సూపర్ హెవీ టైటిల్ వెయిట్‌గల పోటీలు కొనసాగుతాయని వారు వివరించారు.ఈ పోటీల్లో గెలుపొందిన పహిల్వాన్లకు యూసఫ్ ఆలీకేసరి టైటిల్ 75 నుంచి వంద కేజీల విభాగంలో ప్రథమ బహుమతి, బాల్ జూనియర్ కేసరి 55 నుంచి 60 కేజీల విభాగంలో రెండోవ, మూడోవ బహుమతులుగా ట్రాక్ సూట్, మెడల్ సర్టిఫికేట్, ట్రోఫి, కిట్ బ్యాగ్, కాస్ట్యూమ్స్‌లను అందజేస్తామని వారు చెప్పారు.

## పెన్షనర్లకు అన్ని విధాలుగా అండగా నిలుస్తాం : మేయర్



కిస్మత్‌పూర్‌లో జరిగిన పెన్షనర్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న బండ్లగూడ జాగీర్ మేయర్ మహేందర్‌గౌడ్

నార్సింగి, డిసెంబర్ 17 ప్రభాతవార్త : దశాబ్దాల పాటు ప్రభుత్వ ఉద్యోగాలు సమర్థవంతంగా నిర్వహించి, పదవీ విరమణ పొందిన పెన్షనర్లకు అన్ని విధాలుగా అండగా నిలుస్తామని బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ పేర్కొన్నారు. ఆదివారం కార్పోరేషన్‌లోని కిస్మత్‌పూర్ పూర్ణ గార్డెన్‌లో రాష్ట్ర రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేయర్ ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రభుత్వ ఉద్యోగులు రెండున్నర, మూడు దశాబ్దాల పాటు ఉద్యోగాలు చేస్తూ, సమాజ వికాసం, అభివృద్ధిలో భాగస్వాములు అవుతారన్నారు. ప్రజా ప్రతినిదుల ఆలోచనలకు అనుగుణంగా ప్రజల ఇబ్బందులను వేగంగా పరిష్కరించడంలో ఉద్యోగుల పాత్ర కీలకమైందన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు గోకరి సురేష్‌గౌడ్, కార్పోరేటర్ ప్రశాంత్ నాయక్, నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, గోపాల్ ముదిరాజ్, సంగారెడ్డి, నర్సిహ్మాగౌడ్, శంకర్ ముదిరాజ్, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు రాంచందర్‌రావ్, ఉపాధ్యక్షులు రాంచంద్రారెడ్డి పాల్గొన్నారు.

## నేత్రపర్వంగా ప్రారంభమైన ధనుర్మాసోత్సవాలు


చిక్కడపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త: కలియుగ ప్రత్యక్షదైవం చిక్కడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలు ఆదివారం అంగరంగ వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆలయం వ్యవస్థాపక వంశీయుడు జి.శ్రీనాథ్‌గౌడ్, సహాయ కమిషనర్ రామాంజనేయులు ఆధ్వర్యంలో నెల రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ధనుర్మాస ఉత్సవాలను వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రారంభించారు. 18 నుంచి 22వ తేదీ వరకు పహల్‌పత్తు ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరుగుతాయని, అదే రోజు సాయంత్రం ఆరు గంటలకు 'దేవాలయం ద్వారబంధనము' ఉంటుంది. 23న ముక్కోటి ఏకాదశి సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి భక్తులకు వైకుంఠ ద్వారదర్శనం ఉంటుందన్నారు. 23 నుంచి 27వరకు రాపత్తు ఉత్సవాలు, 27న రాత్రి ఏడు గంటలకు నమ్మాళ్వార్ పరమపదోత్సవం ఉంటుందన్నారు. 2024 జనవరి 11న ఉదయం ఐదున్నర గంటలకు కుడారై ఉత్సవం ఉంటుందని, 14న భోగి పండుగ సందర్భంగా రాత్రి ఏడు గంటలకు గోదా సమేత రంగనాథస్వామి వారి కల్యాణం ఉంటుందని, 15న మకర సంక్రమణ పర్వదినోత్సవం సందర్భంగా ఉత్తరాయ పుణ్యకాలం ఉంటుందన్నారు. 16న కనుమ పండుగ సందర్భంగా ఉదయం 11 గంటలకు గోదాఅమ్మవారి కరినోము ఉత్సవాలుంటాయని, భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించాలన్నారు.

## వీధి కుక్కలను పట్టుకెళ్లిన డాగ్‌స్క్వాడ్ ప్రతినిధులు



కిస్మత్‌పూర్‌లోని భవానినగర్, ధాత్రి, ఓమ్ నగర్ కాలనీల్లో వీధి కుక్కలను పట్టుకెళ్తున్న సిబ్బంది

నార్సింగి, డిసెంబర్ 17 ప్రభాతవార్త : బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కిస్మత్‌పూర్‌లో ఉన్న వీధి కుక్కలను డాగ్ స్క్వాడ్ ప్రతినిధులు పట్టుకెళ్లారు. ఆదివారం ఉదయం భవానినగర్, ధాత్రి కాలనీ, ఓమ్‌నగర్, సత్యసాయి కాలనీ తదితర ప్రాంతాలలో డాగ్‌స్క్వాడ్ ప్రతినిధులు బృందాలుగా విడిపోయి 50.వీధి కుక్కలను వలపన్ని పట్టుకున్నారు. వీధి కుక్కల బెడదను తగ్గించాలని ఇటీవల కార్పోరేటర్ గోకరి శ్రీలత సురేష్‌గౌడ్ కమీషనర్ శరత్‌చంద్రకు విన్నవించడంతో కమీషనర్ డాగ్ స్క్వాడ్‌ను పంపి వీధి కుక్కలను పట్టుకెళ్లారు. ఇలా పట్టుకెళ్లిన వీధి కుక్కలకు ర్యాబీస్ ఇంజెక్షన్‌లు వేయడంతో పాటు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించి తిరిగి ఎక్కడ పట్టుకెళ్లారో అక్కడే వదిలి పెడుతారని కమీషనర్ తెలిపారు. వీధి కుక్కల సంఖ్యను తగ్గించడం కోసమే బండ్లగూడ కార్పోరేషన్‌లో బ్లూక్రాస్ ప్రతినిధులతో ఒప్పందం కుదుర్చుకున్నామ న్నారు. ఎక్కడ వీధి కుక్కలున్నా వెంటనే మా దృష్టికి తీసుకు వస్తే అక్కడికి వీరిని పంపిస్తామన్నారు. వీధి కుక్కలను పట్టుకెళ్తున్న సంఘటనలను చూసిన స్థానిక కాలనీ వాసులంతా సంతోషంను వ్యక్తం చేశారు. ఇతర కాలనీల్లో వదులుతుండడం వలన ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు తెలిపారు. అధికారులు ఈ విషయంపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.



**ఆకులు రాలే కాలంలో పచ్చదనమే కరువాయే! చిటారు కొమ్మలన్నీ శ్వేతవర్ణపు విహంగాలకే కొలువాయే!!**

## విజయాలు సాధించడం చాలా సంతోషంగా ఉంది

జీడిమెట్ల, డిసెంబర్ 17, ప్రభాతవార్త : 16 డిసెంబర్ 2023న హైదరాబాద్‌లోని శ్రీరామ్ యూనివర్సల్ స్కూల్‌లో జరిగిన ఆవిష్కార్ రోబోటిక్స్ ఐఆర్‌సి 2023 రోబోటిక్స్ లీగ్‌లో విద్యార్థులు సాధించిన అసాధారణ విజయాలు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. పాఠశాలకు ప్రాతినిధ్యం వహించిన 14 జట్లలో, ప్రశంసనీయమైన 6 జట్లు ఢిల్లీలో ఫైనల్స్‌కు వెళ్ళేందుకు ఎంపిక చేయబడ్డాయి. చివరి రౌండ్ 2024 జనవరి 12, 13వ తేదీలలో ఢిల్లీలోని సూరజ్మల్ విహార్‌లోని యమునా స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో షెడ్యూల్ చేయబడింది. ఏడాదిఇ పొడవునా తమ పిల్లలను రోబోటిక్స్ పోటీలకు పంపడంలో స్థిరంగా ఉన్న తల్లిద ండ్రులకు విఆర్ఎస్ విజె స్కూల్ యాజమాన్యం అభినందనలు తెలియజేశారు.

## మంత్రిని కలిసిన ఎస్.ఎం.ముజీబ్‌హుస్సేనీ

అఫ్జల్‌గంజ్, డిసెంబర్ 17ప్రభాతవార్త: తెలంగాణ రాష్ట్ర నూతనంగా భూర్భగనుల శాఖ మంత్రిగా పదవి భాద్యతలను చేపట్టిన పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని తెలంగాణ నాన్‌గజిటెడ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎస్.ఎం.ముజీబ్ హుస్సేనీ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని శాలువ కప్పి సన్మానించారు.

## ఆదర్శ ఉపాధ్యాయుడు అక్షయకుమార్ దత్

**సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు**



ప్రసంగిస్తున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు

చిక్కడపల్లి, డిసెంబరు 17 ప్రభాతవార్త: ఆదర్శ ఉపాధ్యాయుడు, అంకితభావం కలిగిన నాయకుడు అక్షయకుమార్ దత్ మరణం ఉపాధ్యాయ ఉద్యమానికేగాక అభ్యుదయ ప్రజా ఉద్యమాలకు కూడా తీరని లోటని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యుడు బి.వి.రాఘవులు అన్నారు. రిటైర్యే వరకు విద్యార్థులకు, తర్వాత జీవించినంత కాలం ఉపాధ్యాయులకు, ప్రజా ఉద్యమ కార్యకర్తలకు పాఠాలు బోధించిన దత్ తన దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించడం ద్వారా మరణించాక కూడా వైద్య విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని ప్రశంసించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్(టిఎస్‌యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో యుటిఎఫ్ సీనియర్ నాయకుడు ముదునూరు అక్షయకుమార్ దత్ సంస్మరణ సభ యూటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కె.జంగయ్య అధ్యక్షత వహించగా బివి.రాఘవులు ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. నమ్మిన ఆదర్శాలను ఆచరించి చూపిన గొప్ప మానవతావాది దత్ అన్నారు.

## రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ రైఫిల్ షూటింగ్ విభాగంలో కీర్తనకు బంగారు పతకం



హైదరాబాద్ డిసెంబరు 17 ప్రభాతవార్త: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ రైఫిల్ షూటింగ్ విభాగంలో వివేకానంద నగర్ ఫీజి స్కూల్‌కు చెందిన ఎం.కీర్తన స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకుంది. తెలంగాణ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మేడ్చల్ జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ పోటీలు ఈ నెల 15నుంచి 18 వరకు గచ్చిబౌలిలోని హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ సాట్స్ రైఫిల్ షూటింగ్ రేంజ్‌లో జరిగాయి. ఆదివారం ముగిసిన 10 మీటర్ల హెయిర్ రైఫిల్ షూటింగ్ విభాగంలో కీర్తన 197/200 పాయింట్లను సాధించి అత్యంత ప్రతిభ కనబర్చి స్వర్ణపతకాన్ని కైవసం చేసుకుంది. మధ్యప్రదేశ్‌లోని భూపాల్‌లో 27 నుంచి జనవరి 1వ తేదీ వరకు జరిగే జాతీయ స్కూల్‌గేమ్స్ పోటీలలో పాల్గొనే తెలంగాణ రాష్ట్రజట్టుకు కీర్తన ఎంపికయ్యారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ రైఫిల్ షూటింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగి జాతీయ యూత్ షూటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలలో చక్కటి ప్రతిభ కనబర్చి భారత యూత్ జట్టు సెలక్షన్ ట్రయల్స్‌లో పాల్గొనేందుకు కీర్తన సాధించడం విశేషం. తాను జాతీయ స్థాయి పోటీల్లో రాణించి రాష్ట్రానికి మంచి పేరు ప్రఖ్యాతలు చేస్తానని కీర్తన తెలిపారు.

## ఐటి శాఖ మంత్రి శ్రీధర్‌బాబుకు సన్మానం



**సిద్దిపేట రూరల్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** ఐటి శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా హైదారాబాద్ నుంచి సిద్దిపేటమీదుగా పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గానికి వెళుతున్న దుద్దిళ్ల శ్రీధర్ బాబుకు రాష్ట్ర ఎన్ఎస్‌యుఐ కో-అర్డినేటర్ దాసరి రాజు, నాయకులు ఘనస్వాగతం పలి కారు. అనంతరం సిద్దిపేట శివారులో మంత్రి శ్రీధర్‌బాబును కలిసి ఎన్ఎస్‌యుఐ అధ్వర్యం లో శాలువాతో ఘనంగా సత్కరించారు.

శ్రీధర్‌బాబును సన్మానిస్తున్న ఎన్ఎస్‌యుఐనేతలు

## క్రీడకారులకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర డిసెంబరు 17: ప్రభాతవార్త: హత్నూర మండలం సిరిపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల అవరణలో ఆదివారం జరిగిన కార్యాక్రమంలో స్థానిక ఎమ్మెల్యే వి.సునితాలక్ష్మారెడ్డి పాల్గొని పోటీలలో ప్రతిభ చూపిన వారికి ప్రశంస పత్రాలను అందజేశారు. మండలంలోని వివిద గ్రామాలకు చెందిన విధ్యార్థులకు కరాటే బెల్టుల పోటీలు నిర్వహించారు. ఇందులో ప్రతిభ చూపిన వారికి ఆవార్డులను, ప్రశంస పత్రాలను ఎమ్మెల్యే వి.సునితాలక్ష్మారెడ్డి, తాజా మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలు విధ్యార్థులకు అందజేశారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ విధ్యార్థులకు చదువులతోపాటు క్రీడలు కూడ ముఖ్యమని అన్నారు. కార్యాక్రమంలో ఎంపిపి నర్సింలు, బిఆర్ఎస్ నాయకులు మచ్చనరేందర్, చెన్న నర్సింలు, వెంకట్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, సత్యనారాయణ, తాజు, గౌస్ తదితరులు పాల్గోన్నారు.

**దర్గాలో ప్రార్థనలు చేసిన ఎమ్మెల్యే..**

హత్నూర మండలం కాసాల గ్రామశివారులోని రాయిగోడ్ చింతల్‌లోని దర్గాను ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి, మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డిలు ఆదివారం సందర్శించి ప్రార్థనలుచేశారు. వారి వెంట స్థానిక బిఆర్ఎస్ నాయకులు పాల్గోన్నారు.

## గార్మీ షరీఫ్ పాత్యా వేడుకలకు హాజరైన ప్రముఖులు

**శివ్వంపేట, డిసెంబర్ 17 ప్రభాతవార్త:**

ముస్లిం సోదరులకు ప్రముఖ వేడుకలైన గార్మీ షరీఫ్ పాత్యా ఉత్సవాలను శివ్వంపేట మండల సమీపంలోని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు జహంగీర్ హుస్సేన్ ఫాంహౌస్ సమీపంలోని దర్గా వద్ద ఈ వేడుకలను నిర్వహించారు. ఈ పాత్యా ఉత్సవాలకు జహంగీర్ హుస్సేన్ అనేక మంది ప్రముఖులను ఆహ్వానించారు. ఈ సందర్భంగా హాజరైన వారందరూ జహంగీర్ హుస్సేన్‌కు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. హాజరైన వారందరికీ జహంగీర్ కుటుంబ సభ్యులు అన్నదాన వితరణ చేశారు. వేడుకలకు హాజరైన శివ్వంపేట ఎంపీపీ అధ్యక్షులు కల్లూరి హరికృష్ణ, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పబ్బా రమేష్‌గుప్తలను జహంగీర్ హుస్సేన్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శివ్వంపేట సర్పంచి పి. శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచి స్రవంతి నవీన్‌గుప్త, సీనియర్ జర్నలిస్టు ఇసుగారి మల్లేష్, నాయకులు కొడకంచి శ్రీనివాస్‌గౌడ్, నారాయణరావు, శేరిపల్లి నరేష్, ఊశగోని శంకర్‌గౌడ్, కమలా పూల్‌సింగ్, అక్రమ్ హుస్సేన్, సద్దాం హుస్సేన్ తదితరులు ఉన్నారు.



దత్తజయంతి కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి రాజనర్సింహా

## కరపత్రాన్ని ఆవిష్కరించిన ఆరోగ్య శాఖ మంత్రి

**ఝరాసంగం, డిసెంబరు 17, ప్రభాతవార్త:** ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న మండలంలోని బర్దీపూర్ గ్రామంలోని శ్రీదత్తగిరి మహా రాజ్ ఆశ్రమంలో ఈ నెల 19వ తేదీ నుంచి ఆరంభం కానున్న శ్రీ దత్తాత్రేయ జయంతి మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా ఆదివారం ఉత్సవ కర పత్రాన్ని ఆవిష్కరించారు. ఆదివారం ఆశ్రమ పీఠాధిపతులు 108 వైరాగ్య శిఖామణి అవదూతగిరి మహారాజ్ (అప్పగారు) హైద్రాబాద్‌లోని మంత్రి నివాసానికి చేరుకుని ఉత్సవ కరపత్రాలను మంత్రికి అంద చేయగా ఆవిష్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా అవదూత గిరి మహారాజ్ మాట్లాడుతూ ఈనెల 19న ప్రారంభం అయ్యే జయంతి ఉత్సవాలు ఈ నెల 28వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు. ఉత్సవాలను పురస్కరించుకుని గోపూజ, గురు చరిత్ర పారాయణం, అఖండ సప్తహ పారాయణం, దత్తయజ్ఞం, చండీయాగం పూజా కార్య క్రమాలను నిర్వహించనున్నామని తెలిపారు. ఉత్సవాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కావాలని భక్తులకు సూచించారు.

## యాసంగి పంటకు సాగునీరు ఇవ్వాలి

**నీటిపారుదలశాఖ మంత్రికి హరీష్‌రావు లేఖ**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

రైతుల ప్రయోజనాల దృష్ట్యా రంగనాయకసాగర్‌లోకి నీటిని పంపింగ్ చేయాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు ఆదివారం నీటిపారుల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖ రాశారు. మిడ్ మానేరు నుంచి 1.50 టిఎంసిల నీటిని పంప్‌చేసి యాసంగి పంటకు సాగు నీటిని ఇవ్వాలని లేఖలో కోరారు. శనివారం జరిగిన శాసనసభలో మంత్రికి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖను అందించినట్లు తెలిపారు. జిల్లా రైతంగానికి యాసంగి పంటకు నీరు అందించాలని అందుకు అవసరమైన నీటిని మిడ్ మానేరు నుంచి రంగనాయకసాగర్‌కి నీటిని పంప్ చేయాలన్నారు. నూతనంగా ఏర్పడిన ప్రభుత్వంలో అత్యంత ముఖ్యమైన నీటిపారులశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినందుకు శుభాకాంక్షలు తెలిపారు. మూడేళ్లుగా జిల్లాలో సాగు భూములకు రంగనాయక సాగర్ ద్వారా నీరు అందజేయడం జరిగిందన్నారు. ఈ ఏడు వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో యాసంగి పంటకు సరిపోయే నీరు రిజర్వాయర్‌లో లేక రైతాంగం ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. యాసంగి నీళ్లు అందించాలంటే మూడు టిఎంసిల నీళ్లు ఉండాలని కానీ ప్రస్తుతంరంగ నాయకసాగర్ రిజర్వాయర్‌లో 1.50 టిఎంసి మా త్రమే ఉందన్నారు. రైతుల ప్రయోజనాలు దృష్టిలో పెట్టుకొని వెంటనే మిడ్ మానేరు నుంచి 1.50 టిఎంసిల నీటిని రంగనాయకసాగర్‌కు వచ్చే విధంగా పంపింగ్‌చేయాలని ఇరిగేషన్ అధికారులను అదేశించాలని లేఖలో పేర్కొన్నారు. మూడేళ్లుగా అందించిన విధంగానే ఈసారీ యాసంగి పంటకు కావాల్సిన సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సిద్దిపేటజిల్లా రైతుల పక్షాన మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి లేఖను అందజేసినట్లు వివరించారు.

## మండల సమాఖ్య కార్యాలయంలో సమీక్షా సమావేశం

**పాల్గొన్న అదనపు జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి భీమయ్య**




సమీక్షా సమావేశం పాల్గొన్న అధికారులు తదితరులు

**నర్సాపూర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** నర్సాపూర్ మండల సమాఖ్య కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు సమావేశంలో నాలుగు మండలాల ఏపిఎంలు, సిసిలకు సమీక్షా సమావేశం జరిగింది. సమీక్షా సమావేశానికి అదనపు జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి భీమయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మహిళ సంఘాలకు బ్యాంక్ లింకేజీ, ఫుడ్ ప్రాసెస్, ఎంటర్ ప్రైజెస్, లోకోస్, అజీవికా గ్రామీణ ఎక్స్‌ప్రెస్ యోజన స్కీమ్,(ఆటో ఫోర్ విల్‌గాని, త్రీవిల్ గాని కడ్డీ లేకుండా) స్త్రీనిధి తదితర ఆంశాలపై సమీక్షించడం జరిగింది. కార్యక్రమంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్‌లు మోహన్, వెంకటేశ్వర్లు, స్త్రీనిధి రీజినల్ మేనేజర్ గంగారామ్, కరుణాకర్, నర్సాపూర్ కౌడిపల్లి, శివ్వంపేట్, చిలిపిచెడ్ మండలాల ఏపిఎంలు, సిసిలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే సునీతారెడ్డిని కలిసిన పిఆర్‌టియు నాయకులు

**నర్సాపూర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త:** నర్సాపూర్ అసెంబ్లీ స్థానం నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైనా వాకిటి సునీతాలక్ష్మారెడ్డిని నర్సాపూర్‌కు చెందిన పిఆర్‌టియు నాయకులు ఆదివారం హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైనందున సునీతాలక్ష్మారెడ్డికి పుష్పగుచ్చాలు అందజేసి శాలూవాతో సన్మానించి శుబాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పిఆర్‌టియు అసోసియెట్ రాష్ట్ర అధ్యక్షులు సామ్యానాయక్ మాట్లాడుతూనర్సాపూర్ నియోజక వర్గంలోఅన్నివర్గాల ప్రజల అభివృద్ధికి ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తోనే సాధ్య పడుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఆర్‌టియు మండల ప్రధాన కార్యదర్శి ఎల్‌కె చందర్, కెజీబివి రాష్ట్ర నాయకురాలు స్వరూపరాణి, జిల్లా కార్యదర్శులు ధన్‌సింగ్, రమేశ్, సత్యనారాయణ, వెంకటస్వామి, శ్రీనివాస్, బీమ్లా, రాజు, ప్రసన్నాకుమార్, రేగన్నాయుడు, పంతులు, ఇంతియాజ్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని కలిసిన పిఆర్‌టియు నాయకులు

## ప్రజాస్వామ్యబద్ధంగా ప్రభుత్వ పాలన కొనసాగుతుంది

**ప్రతి ఒక్కరి గొంతుకకు స్వేచ్ఛ ఉంటుంది**
**జాబ్ క్యాలెండర్ ప్రకటించి ఉద్యోగావకాశాలు కల్పిస్తాం**
**ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :**

కాంగ్రెస్ ప్రభుత్వ పాలన పూర్తి ప్రజాస్వామ్య బద్ధంగా కొనసాగుతుందని.. ప్రతి ఒక్కరి గొంతుకకు స్వేచ్ఛ ఉంటుందని రాష్ట్ర ఐటీశాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. హైదారాబాద్ నుంచి మంథని వెళ్తున్న మంత్రి శ్రీధర్‌బాబుకు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎం.డి.ఇమామ్(అత్తు) ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన సా ్వగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్‌బాబును పార్టీ శ్రేణులు పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు విలేకరులతో మాట్లాడారు. ప్రజల సహకారంతో తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించి దేశానికే ఆదర్శంగా నిలుపుతామన్నారు. రాబోయే కాలంలో వ్యవసాయ, ఉపాధి, ఐటిపరిశ్రమల రంగాల్లో రాష్ట్రాన్ని అగ్రగామిగా ఉంచడానికి కార్యాచరణ రూపొందించి అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎవరిపైన కక్ష సాధింపు చర్యలు ఉండవన్నారు. గత ప్రభుత్వ పాలసీ విధానాలు ప్రజలకు ఉపయోగకరంగా ఉంటే



మాట్లాడుతున్న ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

వాటిని అమలు చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలు ఆరు గ్యారెంటీలతోపాటు అన్ని వర్గాల సంక్షేమానికి కృషిచేస్తామన్నారు. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆటో కార్మికులకు తమ ప్రభుత్వం సంపూర్ణంగా అండగా నిలుస్తుందన్నారు. సిద్దిపేట, ఉమ్మడి మెదక్ జిల్లాలోని మంత్రులు దామోదర రాజనర్సింహా, పొన్నం ప్రభాకర్ ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధిలో ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. రాబోయే బడ్జెట్‌లో ప్రణాళికబద్ధంగా అన్ని రంగాలకు ప్రాధాన్యత నిస్తామన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు గూడూరి శ్రీనివాస్(ఎస్టీడి), దరిపల్లి చంద్రం, తాడూరి శ్రీనివాస్‌గౌడ్, మహేందర్‌రావు, బొమ్మల యాదగిరి. ఎం.డి.ఇమామ్(అత్తు), దాసరి రాజు, వంగరి నాగరాజు, గయాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

## జోగిపేటలో మంత్రి దామోదర్ రాజనర్సింహ కృతజ్ఞతా ర్యాలీ

**జోగిపేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త:**

రాష్ట్ర వైద్యఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదివారం జోగిపేటలో ఇటీవల జరిగిన ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించినందుకు కృతజ్ఞతగా ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని అందరు వ్యాపారస్తులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ముందుగా పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సన్మానం అనంతరం పట్టణంలో కృతజ్ఞతా ర్యాలీ చేపట్టారు. దాదాపుగా అన్ని దుకాణాలకు వెళ్లి అక్కడి యజమానులు, వర్కర్లను పలకరించటంతోపాటు వారితో ఫొటోలు, సెల్ఫీలు దిగారు. తన గెలుపునకు సహకరించినందుకుగాను వారికి ధన్యవాదాలు తెలిపారు. అందరినీ ఆప్యాయంగా పలకరించటంతో వ్యాపారస్తులు సంతోషించారు. మంత్రి హోదాలో స్వయంగా తమవద్దకు వచ్చి కృతజ్ఞతలు తెలపటంతో వ్యాపారస్తులంతా ఆనందపడ్డారు. మంత్రి స్వయంగా ప్రతి దుకాణానికి వచ్చి పలకరించిన సందర్భంగా పలువురు మంత్రి దామోదర్‌కు మిఠాయిలు తినిపించటంతోపాటు తమ దుకాణాల వద్ద హంగామా చేశారు. ఈ కృతజ్ఞతా ర్యాలీ జోగినాథ చౌరస్తా నుంచి ప్రారంభమై బసవేశ్వర చౌరస్తా,



జోగిపేటలో వ్యాపారస్తులకు కృతజ్ఞతలు తెలుపుతున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

క్లాక్‌టవర్, అంబేద్కర్ చౌరస్తాల మీదుగా సాగింది. కార్యక్రమంలో జోగిపేట కౌన్సిలర్లు డాకూరి శంకర్, చిట్టిబాబు, పట్లోల్ల రేఖాప్రవీన్, రంగ సురేష్, సురేందర్‌గౌడ్, హరిక్రిష్ణాగౌడ్, కొరబోయిన నాగ రాజు (నాని), దుర్గేష్, కాంగ్రెస్ నాయకులు డాకూరి వెంకటేశం, చింతల సురేష్, సురోత్తంరెడ్డి పాల్గొన్నారు.

**మిహిర టౌన్‌షిప్‌కు భూమిపూజ**

ఆదివారం జోగిపేటలో కృతజ్ఞతా ర్యాలీ నిర్వహించడానికి ముందుగా హౌసింగ్‌బోర్డు సమీపంలో నూతనంగా చేపడుతున్న మిహిర టౌన్‌షిప్‌కు మంత్రి దామోదర్ రాజనర్సింహ భూమిపూజ చేసి బ్రోచర్ విడుదల చేశారు.

## అమ్మవారి నామస్మరణతో మార్మోగిన ఏడుపాయల

**పాపన్నపేట, డిసెంబరు 17, ప్రభాతవార్త:**

ఏడుపాయల వనదుర్గమ్మ ఆలయ పరిసరాలు ఆదివారం భక్తులతో సందడిగా మారింది. ఆదివారం సెలవు రోజు కావడంతో ఆయా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి చేరుకోవడంతో ఆలయ పరిసరాలను అమ్మవారి నామ స్మరణతో మార్మోగింది. ఆదివారం వేకుమజామున వేదపండితులు మంత్రాలు వల్లిస్తూ అమ్మవారికి అభిషేకం నిర్వహించి పట్టువస్త్రాలు, రంగు రంగు పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. ఆలయానికిచేరుకున్న భక్తులు మొక్కుబడిలో భాగంగా అమ్మవారికి తలనీలాలు సమర్పించి మంజీరా పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించి బోనాలు సమర్పించారు.

అమ్మవారికి ఒడిబియ్యం, కుంకుమార్చన పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయానికి చేరుకున్న భక్తులకు అమ్మవారి దర్శనానికి ఇబ్బందులు కల్గకుండా ఆలయ కమిటి బాధ్యులు, ఆలయ ఈఓలు తగు సౌకర్యాలు కల్పించారు. ఆలయానికి చేరుకున్న భక్తులు ఆలయ అర్చకులు శంకర్ శర్మ, పార్థివ శర్మ, నాగరాజు శర్మ, మురళి శర్మ, రాజశేఖర్ శర్మ వేద మంత్రాలు వల్లిస్తుండగా పూజలు నిర్వహించారు. ఆలయ పరిసరాల్లో ఎస్ఐ మహిపాల్‌రెడ్డి సిబ్బందితో నిఘా ఏర్పాటు చేశారు.





పూజలు అందుకుంటున్న వనదుర్గమ్మ భవాని మాత, అమ్మవారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

## అయ్యప్ప స్వామి దేవాలయ నిర్మాణ నిధులలో అవకతవకలు

**కోటి రూపాయల వరకు దుర్వినియోగం..?**
**గుడికోసం పెట్టిన ప్రైవేటు చిట్టీలు,**
**విరాళాలకు లెక్కలు చెప్పరా?**
**గురుస్వామి, మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ పై**
**కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆరోపణలు**

**రామాయంపేట, డిసెంబర్ 17, ప్రభాతవార్త :**

పట్టణంలో నిర్మించిన అయ్యప్పస్వామి దేవాలయ నిర్మాణ, నిధుల సేకరణ కోసం చేపట్టిన ప్రైవేటు చిట్టీలు, సేకరించిన విరాళాలలో పెద్దఎత్తున అవకతవకలు జరిగాయని కాంగ్రెస్‌పార్టీ నాయకులు వెంకుగారి శ్రీధర్‌రెడ్డి, దేవుని నరసింహులు ఆరోపించారు. ఆదివారం సాయంత్రం వారు రామాయంపేట పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయం గేటు ఎదుట వారు మాట్లాడుతూ అయ్యప్ప దేవాలయం నిర్మాణం కోసం నిధుల సేకరణలో భాగంగా దేవాలయం వద్ద ప్రైవేటు చిట్టీలు ఏర్పాటు చేశారన్నారు. వాటి ద్వారా వచ్చిన ఆదాయంతో గుడిని అభివృద్ధి పరచాలని, అలాగే దాతల సహకారం తీసుకోవాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇదంతా ఆలయ ప్రధాన గురుస్వామి, ప్రస్తుత మున్సిపల్ చైర్మెన్ పల్లె జితేందర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిందని వివరించారు. ఆలయ అభివృద్ధి పేరుతో ఏర్పాటు చేసిన ప్రైవేటు చిట్టీలు, విరాళాల లెక్కలు పది సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ ఎవరికి చెప్పలేదని తీవ్ర ఆరోపణలు చేశారు. ఒకవేళ ఎవరైనా అడిగితే వారిపై జులుం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. సుమారు రూ. 75 లక్షలు ఆలయానికి సంబంధించిన డబ్బులకు వడ్డీ ఇస్తానని, జితేందర్‌గౌడ్ తనవద్ద ఉంచుకున్నట్లు వారు తెలిపారు. అలాగే దేవాలయానికి సంబంధించి వసూలు చేసిన విరాళాలకు సంబంధించి మరో 25 లక్షలు ఆయన వద్దే ఉన్నట్లుగా తెలిసిందన్నారు. విరాళాలు ఇచ్చిన వారి పేర్లు శిలాఫలకంపై వేస్తామని చెప్పి పది సంవత్సరాలు దాటినా, నేటికి వేయకుండా కాలయాపన చేయడంపై అనుమానాలు ఉన్నాయన్నారు. గతంలోనూ బాలాజీ టెంపుల్‌కు సంబంధించిన భూముల విషయంలో మున్సిపల్ చైర్మన్‌పై తీవ్ర ఆరోపణలు ఉన్నాయని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్ రామాయంపేట అయ్యప్ప దేవాలయానకి సంబంధించి కమిటీ నియమించి, లెక్కలన్నీ బయటపెట్టి తన నిజాయితీని నిరూపించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దేవాదాయ శాఖ అధికారులకు ఫిర్యాదు చేస్తామని, ఈ విషయాన్ని వదిలే ప్రసక్తే లేదన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు పిట్ల ప్రకాష్‌తో పాటు వెంకటాపూర్ గ్రామానికి చెందిన యువకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**నో కామెంట్ : ఆలయ గురుస్వామి జితేందర్‌గౌడ్**

ఈ విషయంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న అయ్యప్ప స్వామి దేవాలయం ప్రధాన గురుస్వామి, మున్సిపల్‌చైర్మన్ పల్లె జితేందర్‌గౌడ్‌ను ప్రభాతవార్త వివరణ కోరగా నో కామెంట్ అని చెప్పారు.



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

## ప్రజలకు రుణపడి ఉంటా

**-ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి**

**అమీన్‌పూర్, డిసెంబర్ 17 ప్రభాతవార్త:**

తెలంగాణలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో తన విజయానికి సంపూర్ణ సహకారం అందించిన అమీన్‌పూర్ మున్సిపల్ ప్రజలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని పటాన్‌చెరు శాసన సభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా నిధులు కేటాయిస్తామని ఆయన తెలిపారు. ఆదివారం అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని పెద్దచెరువు కట్ట సమీపంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాటా రాజేష్‌గౌడ్ దంపతులు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మూడుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నిక కావడం జరిగిందని తెలిపారు. ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపడుతూ ప్రతి ఒక్కరిని భాగస్వాములను చేస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లోనూ మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమలో మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, వైస్ చైర్మన్ నరసింహాగౌడ్, ఆయా వార్డుల కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## పట్టణంలో ఘనంగా పిల్లల పండగ



పిల్లల పండగలో వ్యాస రచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

**జహీరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** శ్రామిక్ విజ్ఞాన కేంద్రం జహీరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఆదర్శ విద్యాలయంలో పిల్లల పండగను ఘనంగా జరుపుకున్నారు. పిల్లల పండగ ఉత్సవాలకు పట్టణంలోని ఆయా పాఠశాలల నుంచి బాల బలికలు, తల్లిదండ్రులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన కళా ప్రదర్శనలు, విజ్ఞానాన్ని తెలియచేసే ప్రాజెక్టులను, సైన్స్ ఫెయిర్ పరికరాలనుతయారు చేసి తోటి విద్యార్థులకు, తల్లిదండ్రులకు వివరించారు. చిల్డ్రన్ ఫెస్టివల్ సందర్భంగా పాఠశాల ఆవరణలో సందడిగా మారింది. ప్రదర్శనలలో ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులకు నిర్వాహకులు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో పిల్లల పండగ ఉత్సవ కమిటి కన్వీనర్ డాక్టర్ విజయలక్ష్మి, కార్యదర్శి డాక్టర్ కే శివబాబు, పేరెంట్స్ కమిటి బాధ్యులు రామచందర్, మైహిపాల్, ఆయా కమిటిల బాధ్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

**-సన్మానం అందుకున్న పెన్షనర్లు**



జహీరాబాద్‌లో పెన్షనర్లను సన్మానిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, డిసెంబరు 17, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగుల సంఘం జహీరాబాద్ శాఖ ఆధ్వర్యంలో ఆదివారం పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని టిఎన్‌జిఓ భవన్‌లో సంఘం అధ్యక్షులు గడ్డం జనార్ధన్ ఆధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సీనియర్ ఉద్యోగులకు ప్రభాకర్‌చారి, వి నర్సిములు, మహమ్మద్ అజిమోద్దిన్, సయ్యద్ అబ్దుల్ ఖాదర్, అజీం ఉన్నీస బేగం, సంగమేశ్వర్, ధానమ్మ, సమ్మయ్య, నర్సింగ్‌రావు, పి మల్లేశం, అంజయ్యలను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బస్వరాజ్, కార్యవర్గ సభ్యులు విజయలక్ష్మి, మహమ్మద్ అజిం, జి చంద్రశేఖర్, మహమ్మద్ గౌరి, బాబురావు జ్యోసి, ప్రధాన కార్యదర్శి పటేల్ రాజేందర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన గురుకుల విద్యార్థి

**నర్సాపూర్, డిసెంబర్ 17, ప్రభాతవార్త :** నర్సాపూర్ సమీపంలోని అల్లూరి సీతారామరాజు గిరిజన గురుకుల పాఠశాలకు చెందిన విద్యార్థి పవన్ రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు ఎంపికయ్యారు. పవన్ శుక్రవారం మెదక్‌లోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరిగిన 9వ తెలంగాణా క్లాస్ కంట్రీ ఛాంపియన్‌షిప్ 2కె రన్ 16వ కేటగిరిలో రెండవ స్థానం దక్కింది. ఈనెల 23న కామారెడ్డిలో జరగబోయే రాష్ట్రస్థాయి రన్నింగ్ పోటీలకు పవన్ ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో గురుకుల విద్యార్థి పవన్ పాల్గొంటారని ప్రిన్సిపాల్ బిక్షమయ్య తెలిపారు. ఈ సందర్భంగా పవన్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ బిక్షమయ్యతో పాటు వైస్ ప్రిన్సిపాల్ కళ్యాణి,, చార్లెస్, మధు, ప్రశాంత్, పిడి సుజాత, రాజు, కోచ్ శనవాజ్ అభినందించారు.




విద్యార్థి పవన్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు